JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 09-11-2025
Medchal - Malkajgiri । Sunday 09-11-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 163 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 163 । Pages : 8 । ₹: 5


విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## రేవంత్ కు మోడీ బర్త్‌డే విషెస్



జయభేరి, హైదరాబాద్, నవంబర్ 8:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు తన పుట్టినరోజు జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డికి ఆ భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షును ప్రసాదించాలని ప్రధాని తన సందేశంలో ఆకాంక్షించారు.ప్రధానితో పాటు ఇంకా పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు కూడా సీఎం రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ కూడా రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ విషెస్ తెలిపారు.కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ కుమార్ సైతం సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ అమ్మవారి దయ, దీవెనలు రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉండాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో తెలంగాణ ప్రజలకు సేవ చేయాలని బండి సంజయ్ ఆకాంక్షించారు. ఇలా రాజకీయాలకు అతీతంగా పలువురు ప్రముఖులు సీఎంకు శుభాకాంక్షలు చెప్పడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



# పతాకస్థాయికి చేరిన ప్రచారం

- కేసీఆర్‌కు కిషన్ రెడ్డి గురుదక్షణ
- రెండేళ్లలో చేసిందేంటీ
- ప్రతి ఎన్నిక పరీక్షే: రేవంత్ రెడ్డి

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 8:

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం ఆదివారంతో ముగియనుంది. దీంతో మూడు జాతీయ పార్టీలు ప్రతి ఒక్క ఓటర్‌ను కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే వారి మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టి ప్రతిపక్షాల విమర్శలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కచ్చితంగా ప్రతి ఎన్నిక కూడా తమకు పరీక్షేనని చెప్పుకొచ్చారు. గెలిస్తే అందుకు సహకరించిన అంశాలు, ఓడిపోతే అందుకు కారణాలను విశ్లేషించుకుంటామని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షాలు చేసే ప్రతి సవాల్‌ను స్వీకరించే తీరిక తమకు లేదని వివరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో తాము గెలుస్తున్నామని బీజేపీకి కనీసం డిపాజిట్ కూడా రాదని కుండబద్దలు కొట్టారు. దీనికి కౌంటర్‌గా ప్రతిపక్షాలు మాత్రం రేవంత్ రెడ్డి హ్యాండ్సప్ అనేశారని విమర్శలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మృతితో వచ్చిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక హీట్ పీక్స్‌కు చేరింది. రెండు రోజుల్లో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు పార్టీలు బస్తీ బాటపట్టాయి. ఇన్ని రోజులు గ్రౌండ్‌లో దిగి ప్రచారం చేసిన రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టి ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు.

...మిగతాది 2 లో

## విశ్వవిజేతలకు రాష్ట్రపతి అభినందనలు



జయభేరి, న్యూఢిల్లీ నవంబర్ 8:

ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిన భారత మహిళ జట్టును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందించారు. రాష్ట్రపతి భవన్‌లో జట్టు సభ్యులను ఆమె కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించారని, యువతరానికి ఆదర్శంగా నిలిచారంటూ జట్టు సభ్యులను ముర్ము ప్రశంసించారు. జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్.. జట్టు సభ్యులందరూ సంతకం చేసిన ప్రత్యేకమైన జెర్సీని రాష్ట్రతికి కానుకగా అందించింది. ప్రపంచకప్ ట్రోఫీని కూడా రాష్ట్రపతికి అందజేసింది. అంతకు ముందు జట్టు సభ్యులందరూ ప్రధాని నరేంద్ర మోడీని కలిసి ఆయనతో ముచ్చటించిన విషయం తెలిసిందే. కాగా, ఆదివారం నవీ ముంబైలో జరిగిన ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో భారత మహిళ క్రికెట్ చరిత్రలోనే తొలిసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.



కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని వచ్చే సంవత్సరం నుంచి అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ వేడుకకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావలసిన అవసరం ఉందని, కోటి దీపోత్సవ కార్యక్రమానికి జాతీయ స్థాయి గుర్తింపును ఇవ్వాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాస్తానని తెలిపారు.

# జాతీయ స్థాయి గుర్తింపును ఇవ్వాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

జయభేరి, హైదరాబాద్, నవంబర్ 8:

పుట్టిన రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా భక్తి టీవీ చానెల్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వేద పండితులచే పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అక్కడ వేద మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా జరిగిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

...మిగతాది 2 లో



## వైన్ షాప్ ఓనర్లకు రాజగోపాలరెడ్డి వార్నింగ్

జయభేరి, నల్గొండ, నవంబర్ 8:

"నా రూటే సపరేటు.. నా లెక్క వేరే.. నా ఇలాఖాలో నేనే రాజు.. నేనే మంత్రి.." అంటున్నారు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఇప్పటికే పనుల విషయంలో అధికారులకు తనదైన శైలిలో వార్నింగ్ ఇస్తున్న రాజగోపాల్ రెడ్డి.. తాజాగా వ్యాపారులకు షరతులు వర్తిస్తాయని అంటున్నారు. మునుగోడు నియోజక వర్గంలో నూతన వైన్ షాపులను దక్కించుకున్న లిక్కర్ వ్యాపారులకు నయా రూల్స్ పెట్టారట. నా మాటే శాసనమంటూ.. మద్యం వ్యాపారులకు ఆయన ఫత్వా జారీ చేశారట. "మునుగోడు నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు చెల్లవు.. నా సొంత పాలసీలే మునుగోడులో అమలవుతాయ"ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## పతాకస్థాయికి చేరిన ప్రచారం

తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే వాటిని అడ్డుకోవడానికి కిషన్ రెడ్డి, కేటీఆర్ కష్టపడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా హైదరాబాద్ విషయంలో వారిద్దరు బ్యాడ్ బ్రదర్స్ అంటూ ధ్వజమెత్తారు. వారిద్దరు మూలంగా చాలా కార్యక్రమాలు ఆగిపోయాయని, చివరకు కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసు, ఈ ఫార్ములా కేసు ముందుకు సాగడం లేదని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పని చేస్తున్నాయని నిత్యం తమ పనులకు కాలు అడ్డం పెట్టడమేవాళ్ల పని అన్నారు.

**కేసీఆర్‌కు కిషన్ రెడ్డి గురుదక్షణ : రేవంత్**

గతంలో కాంగ్రెస్ చేసిన పనులు, రెండేళ్లుగా తాము చేసిన పనులు, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన పనులను బేరీజు వేసుకొని ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులను కేసీఆర్ మొదలు పెట్టారే తప్ప హైదరాబాద్‌కు కొత్తగా చేసిందేమీ లేదని అన్నారు. మెట్రో నిర్మాణ విషయంలో ఎల్అండ్ టీ వద్ద కమీషన్లు కొట్టేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. దాన్ని పూర్తిగా నష్టాల్లోకి తీసుకెళ్లారని అన్నారు. ఇప్పుడు దాన్ని విస్తరించడానికి కేంద్రం మోకాలు అడ్డుతోందని విమర్శించారు. వారి ఊహించని విధంగా ప్రభుత్వమే మెట్రోను కొనుగోలు చేసే సరికి వారికి ఏం చేయాలో అర్థం కావడం లేదని అన్నారు. తమ కమీషన్లు వచ్చే పనులు మాత్రం చేశారని వాటిపై విచారణకు ఆదేశిస్తే కేంద్రంలో కిషన్ రెడ్డి చక్రం తిప్పుతూ కేసులకు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. తన విజయానికి కారణమైన కేసీఆర్‌కు కిషన్ రెడ్డి గురుదక్షణ చెల్లించుకుంటున్నారని ఫైర్ అయ్యారు. అందుకే బీఆర్ఎస్ విజయానికి కష్టపడుతున్నారని ఆరోపించారు.

**ప్రతి ఎన్నిక పరీక్షే: రేవంత్ రెడ్డి**

రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నిక కూడా తమ పాలనకు పరీక్షగా రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. విజయం సాధిస్తే మరింత ఉత్సాహంతో ప్రజలకు ఎలా మంచి చేయాలని ఆలోచిస్తామని అన్నారు. ఓడిపోతే కచ్చితంగా జరిగిన తప్పులను సరి చేసుకొని ముందుకెళ్తామని అన్నారు. ఓడినా గెలిచినా ప్రభుత్వానికి వచ్చిన ప్రమాదం లేదని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షాలు చేస్తున్న సవాళ్లకు స్పందించి సమయాన్ని వృథా చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ వందకు వంద శాతం విజయం సాధిస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు. ఓడిపోతే ఏం చేస్తారో ప్రతిపక్షాలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీకి కనీసం డిపాజిట్ కూడా రాలేదని చెప్పుకొచ్చారు. కిషన్ రెడ్డి లోపాయికారి ఒప్పందం తెలిసి కూడా బండి సంజయ్ లాంటి వాళ్లు కష్టపడుతున్నారని వారిని చూస్తే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికను రెఫరెండంగా తీసుకునేందుకు వెనుకాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హ్యాండ్సప్ చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించిన ఆయన రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. తమ రెండేళ్ల పాలన చూసి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని సవాల్ చేశారు. అంతే కాని గతాన్ని గుర్తు చేసి అటెన్షన్ డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు.

**రెండేళ్లలో చేసిందేంటీ**

రెండేళ్లలో చేసింది ఏం లేదు కాబట్టే రేవంత్ రెడ్డి ప్రజలను బెదిరించి ఓట్లు అడుగుతున్నారని అన్నారు. తనకు సంబంధం లేదని కాంగ్రెస్ పాలన గురించి ప్రస్తావిస్తున్నారంటే వారి ఓటమి ఖాయమైందని గ్రహించారని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో అన్ని వర్గాలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా మోసం చేసిన వ్యక్తికి ఎలాంటి ట్రీట్మెంట్ ఇవ్వాలో ప్రజలకు బాగా తెలుసు అని అన్నారు. గెలిస్తే అభివృద్ధి చేస్తామని గతంలో కంటోన్మెంట్ లో చెప్పి విజయం సాధించారని ఇప్పుడు అక్కడ ఏం చేశారో వివరించాలని డిమాండ్ చేశారు. ఎవరి హయాంలో హైదరాబాద్‌కు రోడ్లు, ఫ్లైఓవర్‌లు, ఓవర్ బ్రిడ్జ్‌లు సహా వివిధ అంతర్జాతీయ సంస్థలు వచ్చాయో ప్రజలకు బాగా తెలుసని తెలిపారు. హైడ్రా గురించి గొప్పగా చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి దాని కారణంగానే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తింటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దల జోలికి వెళ్లని హైడ్రా కేవలం పేదల ఇళ్లను మాత్రమే కూలుస్తోందని వారిని రోడ్డు పడేస్తోందని మండిపడ్డారు.

## జాతీయ స్థాయి గుర్తింపును ఇవ్వాలి

కోటి లింగేశ్వర స్వామి వారికి శత అష్టోత్తర పంచ మహా హారతులను ఇచ్చారు. స్వర్ణ మహాలక్ష్మి మాతకి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అశేషంగా హాజరైన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. గడిచిన 14 సంవత్సరాలుగా ఈ కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు తుమ్మల నరేంద్ర చౌదరి దంపతులను, రచన టెలివిజన్ యాజమాన్యం, సిబ్బందికి అభినందనలు తెలిపారు.మొదట హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం దేశ సరిహద్దులు దాటి ప్రపంచ దేశాల్లో ఉన్న భక్త కోటికి హరహర మహాదేవుడి నామస్మరణ వినిపిస్తున్నారని, ఇంతటి అద్భుత కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నందుకు నిర్వాహకులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున అభినందనలు తెలియజేశారు.

జన్మదినం రోజున భక్తుల సమక్షంలో గడుపుకోవడం తనకు జీవిత కాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా మిగులుతుందని చెబుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భక్తకోటికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా దేశంలోనే అత్యధికంగా వీక్షించే భక్తి చానెల్‌గా కోట్లాది మంది భక్తుల మన్ననలు పొందడం అభినందనీయమని అన్నారు. ఎన్ని సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ భక్తితో ఈ కార్యక్రమంలో పాల్గొంటే గొప్ప ఆధ్యాత్మిక శక్తిని అందిస్తుందని, ఆ శక్తితో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించడం, దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో కోట్లాది మంది భక్తులు తనకు శక్తిని ఇవ్వాలని కోరారు. వేలాదిగా హాజరైన భక్తుల సమక్షంలో స్వామి అమ్మవారి వాహన సేవను తిలకించారు. రేవంత్ రెడ్డి దంపతులు వైశ్య కుల గురువులు హల్దీపురం పీఠాధిపతి పూజ్యశ్రీ వామనాశ్రమ మహాస్వామీజీ వారి ఆశీర్వచనం తీసుకున్నారు. కాజీపేట శ్వేతార్క మహాగణపతి అనుగ్రహం తీసుకున్నారు. కార్తీక దీపారాధన చేశారు. అనంతరం సప్త హారతిని వీక్షించారు.

## డిసెంబర్ 1 నుంచి శీతకాల సమావేశాలు



జయభేరి, న్యూఢిల్లీ, నవంబర్ 8:

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వాడివేడిగా ప్రారంభం కాబోతున్నాయి. డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 19 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతాయని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అన్ని అంశాలపై చర్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. శీతాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు విపక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అమెరికా సుంకాలతో పాటు ఇతర అంశాలపై సమావేశాల్లో కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1న ప్రారంభమై డిసెంబర్ 19 వరకు జరుగుతాయి. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ ద్వారా ఈ సమాచారాన్ని అందించారు. 2025 డిసెంబర్ 1 నుండి 19 వరకు శీతాకాల సమావేశాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారని మంత్రి ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంటరీ పని అవసరాల ఆధారంగా సమావేశాల వ్యవధి నిర్ణయించినట్లు, అవసరమైతే మార్పుకు లోబడి ఉంటుందని ఆయన వివరించారు.

# పీఓకే దిశగా అడుగులు పడుతున్నాయా..

**దేశ విభజన సమయంలో అప్పటి కశ్మీర్ రాజు హరిసింగ్ తన రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు పలు ప్రయత్నాల తర్వాత అంగీకరించారు. ఆ ప్రక్రియ సాంకేతికంగా పూర్తియింది. కాని వాస్తవ స్థితిని చూసినపుడు, కశ్మీర్‌లో కొంత భాగం పాకిస్థాన్ ఆక్రమణకు గురై ఇప్పటికీ వారి అధీనంలోనే ఉంది. ఈ భాగం, ఆ భాగం అని గాక మొత్తం కశ్మీర్ ప్రశ్నపై రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధాలలో ఏమీ తేలలేదు.**




భారత సైన్యం తూర్పు పాకిస్థాన్‌ను విడదీసి అక్కడి పాకిస్థాన్ సైన్యాన్ని పెద్ద సంఖ్యలో బందీగా పట్టుకున్నపుడు, పిఒకెను మనకు వదలుకున్నట్లయితేనే ఆ బందీలను వదలగలమనే షరతు విధించవలసిందనే అభిప్రాయం ఒకటుంది. ఎందుకైతేనేమి అది జరగలేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం, కశ్మీర్ సరిహద్దు వివాద పరిష్కారంపై చర్చలు జరిగాయి గాని, పిఒకెను సైనికంగా స్వాధీన పరచుకోవడమనే అంశం అజెండా పైకి రాలేదు.నరేంద్ర మోడీ అధికారానికి వచ్చినప్పటి నుంచి పిఒకె స్వాధీనం ప్రస్తావనలు వస్తున్నాయి. ఎప్పటికైనా ఆ పని చేస్తామంటున్నారు. ఆయన నాయకత్వాన గత ప్రధాని వాజపేయికి మించి తీవ్ర జాతీయవాద వైఖరిని అవలంబిస్తున్నందున అటువంటి ప్రస్తావనలు సహజమనాలి. ఆ ధోరణికి అనుగుణంగానే ఆయన ప్రభుత్వం, కశ్మీర్ వివాదమంటూ అసలు ఏమీ లేదని, దానిపై పాకిస్థాన్‌తో చర్చించవలసింది కూడా ఏమీ లేదని, చర్చించటమంటూ ఉంటే వారు పిఒకెను మనకు వశపరచటం గురించి మాత్రమేనని అంటూ వస్తున్నది. అందుకు పొడిగింపుగా మాట్లాడుతూ, మనమే ఒక రోజు ఆ భూభాగాన్ని స్వాధీనపరచుకోగలమని చెప్తున్నది. దీనంతటిలోని సాంకేతికతలను అట్లుంచితే, ఆచరణకు సంబంధించిన ప్రశ్నలు కొన్నింటిని గమనించవలసి ఉంటుంది. ఆ విధమైన ఆక్రమణ సాధ్యమా అన్నది ఒక ప్రశ్న కాగా, ఒకవేళ ఆక్రమించినా దానిని అధీనంలో ఉంచుకుని నియంత్రించగలరా అన్నది మరొక ప్రశ్న. యుద్ధాలు, ఆక్రమణలు, నియంత్రణలు అనే మూడు కూడా ఆషామాషీ విషయాలు కావు. అందువల్ల ఆవేశంతోగాక జాగ్రత్తగా ఆలోచించవలసి ఉంటుంది. మొదట యుద్ధం మాట చూస్తే, పాకిస్థాన్ కన్న ఇండియా చాలా శక్తివంతమైనదని వేరే చెప్పనక్కరలేదు. కాని ఇరువురికి అణ్వస్త్రాలు ఉండటం విస్మరించలేనిది. పాకిస్థాన్ 'న్యూక్లియర్ విధానం' ప్రకారం, తమ భూభాగానికి, భౌగోళిక సమగ్రతకు ముప్పు ఏర్పడినట్లయితే అణ్వస్త్రాలు ఉపయోగిస్తారు. ఆ పని నిజంగా జరుగుతుందా అనేది వేరే విషయం. కాని, జరగదని కూడా ఎవరూ హామీ ఇవ్వలేరు. ఒకసారి తూర్పు పాకిస్థాన్‌ను కోల్పోయిన తర్వాత, మరొక భూభాగాన్ని పోగొట్టుకునేందుకు సిద్ధపడటం తేలిక కాదు. అందువల్ల, పిఒకెను స్వాధీనపరచుకునే లక్ష్యంతోనే యుద్ధమన్నది తేలిక కాదు. ఆ స్థాయి యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా జోక్యమన్నది సరేసరి. పిఒకె స్వాధీనం జరుగుతుందని వాదన కోసం ఒప్పుకుంటే, అపుడు నియంత్రణ ప్రశ్న ముందుకు వస్తుంది. స్వాధీనం తక్షణం జరిగేది కాగా, నియంత్రణ దీర్ఘకాలికం. అందులోని సాధక బాధకాలేమిటి? కశ్మీర్ లోయ భూభాగం 15 వేల చదరపు కిలోమీటర్లకు పైగా ఉంది. పిఒకె వైశాల్యం అంతకు రెట్టింపు కన్న ఎక్కువ. జనాభా ఇక్కడ సుమారు కోటీ 80 లక్షల కాగా, అక్కడ దాదాపు 55 లక్షలు. వీరంతా ముస్లింలే. ఇటు వైపు భూభాగం ఏ విధంగానైతే కొండలు, లోయలు, నదులతో సంక్లిష్టమైనదో, అటువైపుది బహుశా అంతకన్న సంక్లిష్టమైనది. ఇటువైపు గలవారికి మన పట్ల ప్రేమ, విధేయత అన్నవి లేవనుకుంటే, వారికీ లేవు. వీరు నిరసనలకు, తీవ్రవాద చర్యలకు పాల్పడుతున్నారనుకుంటే, అటువైపు వారు అందుకు తోడవుతారు. అటువైపు వారికి పాకిస్థాన్ పట్ల కొంత నిరసన ఉండవచ్చు. దాని అర్థం ఇండియాను ప్రేమిస్తున్నారని కాదు. వీరూవారు కలిస్తే కశ్మీరీ జాతి మొత్తంగా స్వతంత్ర భావనలు బలపడి, రెండు దేశాలతో సంబంధం లేని విధంగా స్వతంత్ర కశ్మీర్ ఆలోచనలు తలెత్తగల అవకాశం ఎంతైనా ఉంటుంది. రెండు కశ్మీర్‌లను ఆనుకుని ఉత్తరాన, పడమరన అఫ్ఘానిస్థాన్‌తోపాటు మధ్య ఆసియా ముస్లిం దేశాలు విస్తరించి ఉన్నాయి. వాటన్నింటా ఇస్లామిస్ట్ తీవ్రవాద సంస్థలున్నాయి. లోగడ ఒక దశలో ఆ సంస్థలు కొన్ని కశ్మీర్‌ను ఇండియా నుంచి విముక్తం చేయగలమని ప్రకటించి అక్కడి సంస్థలకు ఆయుధాలు, నిధులు, శిక్షణలు కూడా ఇచ్చాయి. మధ్య ఆసియాలోని ఇస్లామిస్ట్ తీవ్రవాదం కొన్ని దశాబ్దాలుగా అంతులేకుండా పెచ్చరిల్లుతూనే ఉంది. సమయానుసారంగా ఆ ధోరణులకు ఆ ప్రాంతపు దేశాలలోపాటు, తమ వ్యూహాత్మక క్రీడల కోసం అగ్రరాజ్యాలూ ప్రోత్సాహం ఇస్తూనే ఉన్నాయి ఇప్పటికే కశ్మీర్‌లో మన బలగాలు కొన్ని లక్షలు మోహరించి ఉన్నట్లు అంచనా. పిఒకె స్వాధీనం తర్వాత మరెన్ని మోహరింపులు అవసరం కావచ్చు? ఎంతకాలం? అట్లయినా పిఒకె శాశ్వతంగా భారతదేశంలో ఉండిపోగలదనే హామీ ఉంటుందా? కశ్మీర్ విషయమై నెహ్రూ తప్పు చేసారనేది. ఈ మాటను ప్రధాని మోడీ అక్టోబర్ 31న సర్దార్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఆయన 'ఐక్యతా విగ్రహం' వద్ద ప్రసంగిస్తూ మరో మారు అన్నారు. కశ్మీర్ సంస్థానం మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలన్నది పటేల్ ఆకాంక్ష కాగా, అందుకు నెహ్రూ అడ్డుపడ్డారని ఆరోపించారు మోడీ. దేశ ప్రజలపై గాంధీజీ, నెహ్రూల ప్రభావం ఇప్పటికీ తగినంత ఉన్నందున, దానిని దెబ్బ తీస్తూపోతే ఆ మేరకు తమ ప్రభావం ఇంకా వ్యాపిస్తుందన్నది సంఘ్ పరివార్, బిజెపిల వ్యూహం. అందుకోసం ఆ ఇరువురిపై రకరకాలగా ఆరోపణలు, విమర్శలు తరచు చేస్తూ వస్తున్నారు. గాంధీజీపై విమర్శల పట్ల వ్యతిరేకత పెరుగుతుండటంలో ఆయనను పక్కన ఉంచి, నెహ్రూపై ఆరోపణలు పెంచుతున్నారు. గాంధీజీ, నెహ్రూలు విమర్శలకు అతీతులని కాదు. కాని ఆరోపణలు, విమర్శలు ఎవరు ఎవరిపై చేసినా అందుకు ఆధారాలుండాలి. ఆ విధంగా చూసినపుడు కశ్మీర్ విషయమై నెహ్రూ, పటేల్ పాత్రలు తెలుపు, నలుపు పద్ధతిలో గిరిగీసినట్లేమీ లేవు. పటేల్ జీవిత చరిత్రను, రికార్డులు, వ్యక్తిగత లేఖలు, ఇంటర్వ్యూల ఆధారంగా అతి సమగ్రంగా రచించిన వాడు, గాంధీజీ మనుమడైన రాజ్‌మోహన్ గాంధీ. ఆయన తను పేర్కొన్న ప్రతి అంశానికి ఆధారాలను ఉదహరించారు. వాటిని గమనించినపుడు ప్రధాని మోడీ వాదనలు పరిశీలనకు నిలవవు. కేవలం నెహ్రూను కించపరచి, దేశ ప్రజల దృష్టిలో తన విలువను తగ్గించి, బిజెపి భావజాలానికి అనుకూలుడని తాము భావించే పటేల్‌ను పైకెత్తటం కోసం ఆ విధంగా మాట్లాడుతున్నట్లు అర్థమవుతుంది. కశ్మీర్ తోపాటు గల దేశ విభజన విషయంలోనూ నెహ్రూ, పటేల్ వైఖరుల గురించి వారు ఇదే విధంగా ప్రచారాలు చేస్తున్నారు. పటేల వ్యక్తిగత కార్యదర్శి, సన్నిహిత సలహాదారు అయిన వి. పి. మెనన్ రాసిన 'ద ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా', వి. శంకర్ రచన 'మై రెమిని సెన్సెస్ ఆఫ్ సర్దార్ పటేల్' వంటి గ్రంథాలను చదివితే కశ్మీర్‌పట్ల ఎవరి వైఖరి ఏమైనదీ స్పష్టమవుతుంది. ముస్లింలు ఆధిక్యతలో గల కశ్మీర్ విషయమై పటేల్ ఆసక్తి చూపకపోవటం దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించిన తర్వాత కూడా 1947 సెప్టెంబర్ 13 వరకు కొనసాగింది. ఆయన ఆ రోజు రక్షణ మంత్రి బల్ దేవ్ సింగ్‌కు లేఖ రాస్తూ, "ఒకవేళ (కశ్మీర్) వేరే డొమినియన్ (పాకిస్థాన్ అని భావం) లో చేరదలచుకుంటే" ఆ వాస్తవిక స్థితిని తాను గుర్తించగలనని చెప్పారు. తర్వాత అదే రోజు మధ్యాహ్నం, జునాగఢ్ విలీనాన్ని పాకిస్థాన్ అంగీకరించిన తర్వాతనే పటేల్ వైఖరి మారింది. జునాగఢ్ సంస్థాన పాలకుడు ముస్లిం, అక్కడి ప్రజలు మెజారిటీ హిందువులు. అటువంటి సంస్థానం పాకిస్థాన్‌లో విలీనమైనపుడు, హిందూ పాలకుడు, మెజారిటీ ప్రజలు ముస్లింలు అయిన కశ్మీర్‌ను ఇండియాలో ఎందుకు విలీనం చేసుకోరాదన్న నిర్ణయాన్ని పటేల్ అపుడు మాత్రమే తీసుకున్నారు. ఇందుకు భిన్నంగా, తమ పూర్వీకుల జన్మభూమి అయిన ఆ సుందర దేశాన్ని వదలుకోవటం నెహ్రూకు ఎప్పుడూ ఆమోదయోగ్యం కాలేదు. తన మిత్రుడైన షేక్ అబ్దుల్లా తోడ్పాటుతో కశ్మీర్ విలీనానికే నిరంతరం ప్రయత్నించారు. అందువల్ల, ఇటువంటి పలు పరిణామాలను విస్మరిస్తూ ప్రస్తుత రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరించటం తగిన పనికాదు.

## చంద్రబాబు ఆశ మాత్రం చావలేదు

■ చంద్రబాబుపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం

జయభేరి, అమరావతి నవంబర్ 8:



ఏపీ సీఎం చంద్రబాబుపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న బనకచర్ల, నేడు నల్లమల సాగర్.. పోలవరం లింక్ ప్రాజెక్టుకు అనుమతులు రాకున్నా.. చంద్రబాబు ఆశ మాత్రం చావలేదని అన్నారు. అనుసంధానంపై ఉన్న శ్రద్ధ.. పోలవరం పూర్తి చేయడంపై లేదని విమర్శించారు. పనికి రాని ప్రాజెక్ట్ కు DPRల మీద నిధుల సమీకరణ మీద పెట్టే దృష్టి .. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై పెట్టడం లేదని మండిపడ్డారు.పోలవరంతో పాటు 56 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉంటే వాటిని గాలికొదిలేసి లింక్ ప్రాజెక్ట్ అని పట్టుకు తిరుగుతున్నారని చంద్రబాబు పై షర్మిల మండిపడ్డారు. జలయజ్ఞానికి నిధులు లేవు కానీ.. రూ.58 వేల కోట్లతో పోలవరం - నల్లమల సాగర్ లింక్ కడతారట అని అన్నారు. ఇది భారీ అవినీతికి స్కెచ్ కాకపోతే మరేంటి అని ప్రశ్నించారు. లింక్ ప్రాజెక్ట్ తో ఉపయోగం లేదని నిపుణులు మొత్తుకుంటున్నా.. DPR పేరిట హడావిడి ఎందుకు అని నిలదీశారు. పోలవరం,పెండింగ్ జలయజ్ఞం ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వానికున్నది సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ఎత్తు తగ్గించి కేంద్రం అన్యాయం చేసినా నోరు మెదపనిది ఇందుకే అని అన్నారు.పోలవరం ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15 కు కుదించి జీవనాడిలో జీవం తీశారని వైఎస్ షర్మిల విమర్శించారు. రూ.25వేల కోట్ల ఆర్ అండ్ ఆర్ మిగులు కోసం ప్రాజెక్టుని డ్యామ్ గా మార్చారని అన్నారు. 7 లక్షల ఎకరాలకు, 25 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, 30 లక్షల మందికి తాగునీరు అందించే పోలవరం ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చి ప్రశ్నార్థకం చేశారని అన్నారు.. బ్యారేజ్‌గా తప్ప బహుళార్థక సాధకంగా పనికి రాకుండా చేశారని విమర్శించారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందించక తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. జాతీయ హోదా ప్రాజెక్టుకి కేంద్రం ఇంత అన్యాయం చేస్తుంటే, మిగులు బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రయోజనాలకు సమాధి కడుతుంటే కూటమిలో పెద్దన్న పాత్ర పోషించే చంద్రబాబు నోరుమెదపకుండా లింక్ పేరుతో హంగామా చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. బాబుకు ATMగా పనికొచ్చేందుకే ఈ కొత్త ప్రాజెక్టు అని ఆరోపించారు.రాష్ట్రంలో జలయజ్ఞం పెండింగ్ ప్రాజెక్ట్‌ల సంఖ్య 56.. ఇవ్వాల్టి అంచనాల ప్రకారం పూర్తి చేయాలంటే కావాల్సిన నిధులు రూ. 60 వేల కోట్లు.. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే అందుబాటులోకి వచ్చే సాగునీటి లభ్యత 581 టీఎంసీలు.. సాగుబడి జరిగే అదనపు విస్తీర్ణం అక్షరాల 54 లక్షల ఎకరాలు.. గోదావరి లింక్ ప్రాజెక్టుకు పెట్టే 80 వేల కోట్ల నిధులతో జలయజ్ఞం పూర్తి చేస్తే అదనంగా 30 లక్షల ఎకరాలకు ప్రయోజనం జరుగుతుందని వైఎస్ షర్మిల తెలిపారు. ఇంత తెలిసి చంద్రబాబు పెండింగ్ ప్రాజెక్ట్‌లపై కన్నెత్తి చూడటం లేదంటే.. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎంతుందో అర్థమవుతుందని అన్నారు.



## వైన్ షాప్ ఓనర్లకు రాజగోపాలరెడ్డి వార్నింగ్

రాజగోపాల్‌రెడ్డి అంటున్నారట. రాష్ట్రవ్యాప్త మద్యం పాలసీ మునుగోడులో చెల్లదంటూ లిక్కర్ వ్యాపారులకు షరతులు విధిస్తున్నారట. తాను గీసిన లైన్ దాటితే ఒప్పుకునే ప్రసక్తే లేదని మద్యం వ్యాపారులకు ఆయన ఫత్వా జారీ చేశారట. నియోజకవర్గంలో మద్యం షాపులను దక్కించుకున్న లిక్కర్ వ్యాపారులు రాజగోపాల్ రెడ్డిని కలిసారు.మద్యం వ్యాపారులకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మూడు కండిషన్లు పెట్టారట. మొదటది వైన్స్ షాపులు ఉదయం 10 గంటలకు తెరవడానికి వీల్లేదు. మధ్యాహ్నం 1గంటకు షాపులు తెరవాలి. రాత్రి 10 గంటలకు క్లోజ్ చేయాలి.

రెండవది పర్మిట్ రూమ్‌లు పగటిపూట మూసేయాల్సిందే.. సాయంత్రం 5 గంటలకు ఓపెన్ చేసి వైన్స్ షాపుతోపాటే క్లోజ్ చేయాలి. మూడవది.. బెల్టు షాపులకు లిక్కర్ అమ్మేందుకు వీల్లేదు. తన ఆదేశాల మేరకే మునుగోడులో లిక్కర్ షాపులు నడవాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారట. నియోజకవర్గంలోని 159 గ్రామాల్లో ప్రత్యేకంగా టీమ్ లను ఏర్పాటు చేస్తానని, ఈ టీమ్స్ బెల్టుషాపులపైన నిఘా పెడ్తాయని, లిక్కర్ వ్యాపారులకు ఎమ్మెల్యే చెప్పారట. తన షరతులు, తాను గీసిన లైన్ దాటితే ఒప్పుకునే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారటమునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మద్యం అమ్మకాలపై ఉద్యమమే చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉన్న నేపథ్యంలో బెల్ట్ షాపుల నిర్మూలన ఉద్యమం చేపట్టి గ్రామాలలో బెల్ట్ షాపులు లేకుండా చేశారు. గత 20 నెలల్లో బెల్టుషాపులకు లిక్కర్ వెళ్లకుండా ఎమ్మెల్యే తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. దీంతో తెలుగు రాష్ట్రాల్లో మునుగోడును రోల్ మోడల్ గా నిలబెట్టాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చెబుతున్నారు. రెండేళ్లలో మరిన్ని కఠిన చర్యలు అమలు చేయడం ద్వారా వెనకబడ్డ మునుగోడులో మద్యపాన నిషేధం పక్కాగా అమలు చేయొచ్చనీ రాజగోపాల్ రెడ్డి భావిస్తున్నారట. ఇందుకు అందరూ సహకరించాలని తనదైన శైలిలో లిక్కర్ వ్యాపారులకు వార్నింగ్ ఇచ్చారట. మొత్తానికి మద్యం వ్యాపారులకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జారీ చేసిన మద్యం ఫత్వాపై చర్చ జరుగుతోంది.

# ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 08:**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను యాదగిరిగుట్టలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ మాజీ ధర్మకర్త పెలిమేల్లి శ్రీధర్ గౌడ్ భారీ కేక్ కటింగ్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. భారీ ఎత్తున టపాకాయ బాణాసంచి పేల్చి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెలిమేల్లి శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి అట్టడుగు బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమం పథకాలు అందిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి చెందుతుంది. వ్యవసాయంకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి రుణమాఫీ చేసి భారత దేశంలోనే మార్గదర్శిగా నిలిచారు. మహిళలకు మొదటి ప్రాధాన్యత కల్పించి అన్ని రంగంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలని వడ్డీలేని రుణాలు, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, వంట గ్యాస్, ప్రతి గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లు,ఉచిత విద్యుత్ పాటు అత్యధికంగా సిఎం రీలిఫ్ ఫండ్ కింద చెక్కులను అందించిన ఘనత.. ఆరోగ్యశ్రీ పెంపు ఉచిత వైద్యం అందజేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు మన ప్రజా ప్రభుత్వంలో ఇచ్చారు. ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డులు అందించి,బియ్యం అందించిన ఘనత వారికే చెందుతుందని యాదగిరిగుట్ట ఆలయ మాజీ ధర్మకర్త పెలిమేల్లి శ్రీధర్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు సుదుగు జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు బిట్లు హరీష్,మిట్ట రాంచందర్, సయ్యద్ సలీం, రాజిరెడ్డి, మురళి, శ్రీరామ్ మూర్తి, నరసింహ, సంజీవ, శ్రీరామ్, రజినీకాంత్, లక్మణ్, జమాల్, నవీన్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## చోళ్ళేటి భాస్కరా చారికి గౌరవ డాక్టరేట్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణానికి చెందిన చొల్లేటి భాస్కరాచారి గత 40 సంవత్సరాలుగా వివిధ రంగాలలో విశిష్ట సేవలను అందించినందుకు గాను వారి కృషికి సంయుకంగా నిర్వహించిన సదస్సులో కొంతమంది సమాజ సేవ చేసినటువంటి ఉద్యమకారులను గుర్తించి వారికి గౌరవ డాక్టరేట్ హైదరాబాద్ కళాభారతి లో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ ను ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ , కోఆర్డినేటర్ చెన్నారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. నా సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు ఇంకా మరింత ఉత్సాహంతో ప్రజలకు అందుబాటులో అన్ని విధాల సేవలు అందిస్తానని తెలిపారు, ఈ అవార్డు అందుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉందని సమాజ బాధ్యతగా తాను చేసింది కొంచమేనని తన చివరి శ్వాస వరకు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసే శక్తిని ఆ దైవం తనకు ఇవ్వాలని కోరుకుంటున్నాను అని తెలియజేశారు. ఈ గౌరవ డాక్టరేట్ నా శ్రీమతి చోళ్ళేటి అనురాధ తో కలిసి తీసుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది అని తెలిపారు.



## నేడు తుర్కపల్లిలో శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ

**జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 08 :**

నేడు తుర్కపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి స్వగృహంలో బ్రహ్మశ్రీ డాక్టర్ పి.ఎం. మనోజ్ తాంత్రి( కేరళ) ఆధ్వర్యంలో పెండెం శ్రీనివాస్ గురుస్వామి, పత్తిపాటి రామారావు గురుస్వాముల పర్యవేక్షణలో శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధిక సంఖ్యలో శ్రీ అయ్యప్ప మాల ధారణ స్వాములు పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## హిందూ అలయాలను మాత్రమే కూల్చివేసారు

**జయభేరి, గోదావరి ఖని:**

రోడ్డు విస్తరణ పేరుతో గోదావరిఖనిలో 46 దారి మైసమ్మ ఆలయాలను కూల్చివేయడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. . రోడ్డుకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో ఆలయాలను కూల్చివేసిన అధికారులు మసీదులను ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. ఇదే అంశంపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ కు ఫోన్ చేసి మాట్లాడటం జరిగింది. రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని కూల్చామని చెప్పిన అధికారులను.. అదే రోడ్డుకు అడ్డుగా ఉన్న మసీదులు ఎందుకు కూల్చలేదని ప్రశ్నించచాను. ఎవరి మెప్పు కోసం మూకుమ్మడిగా మైసమ్మ ఆలయాలను కూల్చివేశారని నిలదీసానని అన్నారు.

ఆటో డ్రైవర్లు తమ ఆటో అడ్డాల దగ్గర ప్రతిరోజు మైసమ్మ ఆలయం వద్ద మొక్కుకుంటారు. భక్తులు నిత్యం దర్శించుకుంటారు. రోడ్డుకు అడ్డంగా ఉన్నాయనే నెపంతో ఇష్టమొచ్చినట్లు కూల్చివేస్తారా? భక్తుల మనోభావాలు పట్టవా? పోనీ అదే రోడ్డుకు అడ్డంగా మసీదులు కూడా ఉన్నాయి కదా? మరి వాటినెందుకు కూల్చివేయలేదు? హిందువులంటే అంత చులకనాని నిలదీసారు.

గోదావరిఖని యంత్రాంగానికి 48 గంటల సమయమిస్తున్నాను. కూల్చివేసిన దారి మైసమ్మ ఆలయాలన్నింటినీ ఆలోపు పునర్నిర్మించాలి. లేకపోతే దారికి అడ్డంగా ఉన్న మసీదులన్నింటినీ కూల్చివేయాలి. లేనిపక్షంలో నేను గోదావరిఖనికి వచ్చి, దగ్గరుండి మసీదులన్నింటినీ కూల్చివేయిస్తాను. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ అయిన వెంటనే గోదావరిఖని వస్తాను. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సహా అధికారులందరినీ ప్రజల మందు నిలబెడతాను. జరగబోయే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇదే అంశంపై పెద్దపల్లి జిల్లా బిజెపి నేతలతో పాటు రాష్ట్ర నాయకులతో చర్చించి కార్యాచరణ సిద్ధం చేస్తామని హెచ్చరించారు.

## మైనర్ బాలికతో అసభ్య ప్రవర్తన

- పోక్సో కేసు నమోదు

**జయభేరి, సత్తెనపల్లి:**

సత్తెనపల్లిలో దారుణ ఘటన జరిగింది. వివాహిత తో అక్రమ సంబంధం పెట్టుకున్న తులసి కృష్ణ (34) కూతురు వరుస అయ్యే కుమార్తె పట్ల అసభ్య ప్రవర్తన బయటపడింది. తల్లీ కీ విషయం చెప్పిన కూడా తీరు మారకపోవడంతో మైనర్ బాలిక బంధువులను ఆశ్రయించింది. దాంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. తులసి కృష్ణ పై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

## ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

- వచ్చే పది ఏండ్లు కూడ తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి

**జయభేరి, అడ్డగూడూరు :**



వచ్చే పది ఏండ్లు కూడా తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే అని అడ్డగూడూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి అన్నారు, అడ్డగూడూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం అడ్డగూడూరు మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు చెడే అంబేద్కర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి మల్లేష్ ఉమ్మడిగా కలిసి మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడడంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెపు పాండు, మోత్కూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిత్తలూరు సోమన్న, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కడారి రమేష్,జిల్లా కాంగ్రెస్ నాయకులు చెడే మహేందర్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు నాగులపల్లి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు కన్నెబోయిన లింగస్వామి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు పూలపల్లి రాజశేఖర్ రెడ్డి, ఆసర్ల మచ్చగిరి, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు పరిగల మహేష్, బుడుగుండ్ల రవి, పయ్యావుల సాయి, గుజ్జరాజు ,బండి మహేష్,, నిమ్మల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరీశుడి పుష్కరిణిలో నీటి నాణ్యత పరిశీలన చేస్తున్న ఈవో

**జయభేరి, యాదగిరిగుట్ట:**

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర సింహస్వామి వారి పుష్కరిణి,సత్యనారాయణ స్వామి వ్రతం పాటు కళ్యాణ కట్ట యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్ రావు పరిశీలించారు. శనివారం భక్తులు ఎంతో పుణ్యంగా చేసే పుష్కరిణిని ఆయన సందర్శించి అందులోని నీటి నాణ్యతను పరిశీలించారు. పుష్కరిణిని ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ,పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. రాత్రి సమయంలో లైటింగ్ పాటు పుష్కరిణిలో స్నానాలు చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆలయ ఇంచార్జి డిఈవో జూశెట్టి కృష్ణ,ఏఈవోలు గజవెల్లి రఘ,నవీన్ కుమార్, శంకర్ నాయక్, ఆలయ సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**యాదగిరీశుడి సేవలో ప్రముఖులు..**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత కుటుంబ సభ్యులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదం,జ్ఞాపికను అందజేశారు. ఆమె వెంట యాదగిరిగుట్ట తహసీల్దార్ గణేష్‌నాయక్, ఆలయ సూపరింటెండెంట్ రాజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడవాలి

- గాయత్రీ మంత్ర నామస్మరణంతో మారుమోగిన మల్లెపల్లి పట్టణం
- ఘనంగా గాయత్రీ యజ్ఞం

**జయభేరి, కొండమల్లేపల్లి :**



గాయత్రీ పరివార్ కొండమల్లేపల్లి వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 108 కుండీల గాయత్రీ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. సుమారు 2000 మంది ఒకేసారి గాయత్రి మంత్రాన్ని పఠించడంతో కొండమల్లేపల్లి పట్టణం గాయత్రీ దేవి నామస్మరణంతో మారుమోగింది.గాయత్రీ పరివార్ వారు గత రెండు రోజులుగా చేపట్టినటువంటి కలశయాత్ర, సహస్ర దీప యజ్ఞం, 108 కుండీల గాయత్రి మహాయజ్ఞం శనివారం పూర్తయింది. ఈ సందర్భంగా గాయత్రి తీర్థ్ శాంతి కుంజ్ హరిద్వార్ నుండి వచ్చిన గాయత్రీ పుత్రులు దైవ సందేశాన్ని ఇచ్చారు.

మానవ మనుగడకు అవరోధాలు సృష్టించే చెడు వ్యసనాలను వదిలేసి ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సూచించారు. శుక్రవారం నిర్వహించిన కలశయాత్రలో కేరళ డోలు వాయిద్యం, కోలాటం చూపర్లను ఆకట్టుకున్నాయి. పట్టణ ప్రజలు మంత్రముగ్ధులయ్యారు. శనివారం నిర్వహించిన 108 కుండా కుండీల గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న భక్తులు దైవంశ సంభూతులై, యజ్ఞకార్యంలో నిమగ్నమయ్యారు. యజ్ఞం అనంతరం సుమారు 3000 మందికి పైగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలలో పాల్గొన్న భక్తులకు కార్యక్రమం దిగ్విజయం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా గాయత్రీ పరివార్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ, రాందాస్, విక్రమ్, శ్రీశైలం, రాఘవ, వింజమూరు చంద్రమౌళి, నూతన గంటి జగన్,దాచేపల్లి వెంకటేశ్వర్లు,ఏరుకొండ రాము,వింజమూరు సత్యనారాయణ,గాజుల రాఘవులు,గాజుల అజితా,కుషాల్, యాద వరలక్ష్మి ధనుంజయ, నేలపట్ల వాసుదేవ్, మారం వెంకన్న, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి,శంకర్, మహేష్,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి,స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ శ్రేణులు



**జయభేరి, గార్ల, నవంబర్ 8:**

దొర పాలనను అంతమొందించి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సూపరిపాలన అందిస్తున్న పాలన దక్షకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ విగ్రహ కూడలిలో కాంగ్రెస్ పార్టీ మండల కార్య నిర్వాహక అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు .ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత రేవంత్ రెడ్డి కే దక్కిందని అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్న గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రావూరి వెంకట్రామయ్య, జాతీయ శ్రీ శక్తి అవార్డు గ్రహీత శంషాద్ బేగం, గుండా వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్ లాల్, షేక్ యాకుబ్ పాషా, బానోత్ హాతిరాం నాయక్, మాజీ సర్పంచ్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ శ్రామికులకు 200 రోజులు పని కల్పించాలి



**జయభేరి, గార్ల, నవంబర్ 8:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రకారం శ్రామికులకు సంవత్సరానికి రెండు వందల రోజులు ఉపాధి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.శనివారం మండల పరిధిలోని పినిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గ్రామాల్లో యాంత్రీకరణ పద్ధతులు వచ్చిన తర్వాత నిరుపేదలకు వ్యవసాయ పనులు లేక మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులు తప్పనిసరిగా చేయాల్సి వస్తుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రేషన్ కార్డు, సబ్సిడీ గ్యాస్,ఉచిత కరెంటు అందే విధంగా చూడాలని అన్నారు.రేషన్ షాపుల ద్వారా ప్రతి మనిషికి 10 కేజీల సన్న బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతము ఇస్తున్న రెండు వేల రూపాయలు పెన్షన్ పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా సరిపోయే పరిస్థితి లేకపోవడంతో నాలుగువేల రూపాయలకు పెంచాలని అన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చాపల కృష్ణవేణి, చింతల నాగమణి, అనిత, మహేశ్వరి, మాధవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మీకు ఇంకా బుద్ధి రాలేదా

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 8:**

వైసీపీ అధినేత జగన్, ఆయన సోషల్ మీడియా వర్గాలపై శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ పెంచి పోషిస్తున్న 'పేటీఎం బ్యాచ్' తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆమె గట్టిగా హెచ్చరించారు. సొంత తల్లిని, చెల్లిని కూడా వదలకుండా వ్యక్తిత్వ హననానికి పాల్పడిన దుర్మార్గుడు జగన్ అని అనురాధ విమర్శించారు.కల్తీ మద్యంతో రాష్ట్రంలో 30 వేల మంది ప్రాణాలు తీసి, ఎందరో తల్లులకు కడుపుకోత మిగిల్చారని ఆమె మండిపడ్డారు. సోషల్ మీడియాలో యువతతో తప్పుడు పోస్టులు పెట్టించి, వారిని జైలు పాలు చేస్తూ తల్లిదండ్రులకు ఆవేదన మిగులుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలతో జగన్ చేయిస్తున్న ఇలాంటి వికృత చేష్టల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భాస్కర్ రెడ్డి లాంటి వారిని ఎంతమందిని ప్రయోగించినా, వారంతా కటకటాల వెనక్కి వెళ్లడం ఖాయమన్నారు.తోక లేని వ్యాఖ్యలతో మహిళలను కించపరిచే వారు అసలు మనుషులేనా అని ఆమె నిలదీశారు. "పనికిమాలిన పేటీఎం బ్యాచ్‌తో ఇంకెంత కాలం విషప్రచారం సాగిస్తారు? ప్రజలు 11 సీట్లు ఇచ్చినా మీకు ఇంకా బుద్ధి రాలేదా?" అని ప్రశ్నించారు.

# ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

జయభేరి, పరకాల, నవంబర్ 08:




పరకాల పట్టణ కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద పరకాల నియోజవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న ప్రజానాయకుడిగా నిలిచారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. ముఖ్యంగా ప్రజల పాలన – ప్రజా సంక్షేమం కోసం మహిళలకు ఉచిత బస్సు, పది లక్షల ఆరోగ్యశ్రీ పథకం,కళ్యాణ లక్ష్మి, రైతు రుణ మాఫీ,రైతు భరోసా,తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 6కిలోలు ప్రతి ఒక్కరికి కుటుంబాలకు సన్న బియ్యం, అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి, 200 యూనిట్ ఉచిత విద్యుత్, 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ స్థాపన వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజల సంక్షేమానికి పాటుపడుతూ ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని, ఆయనకు దీర్ఘ ఆయుష్షు కలగాలని కోరుకుంటున్నాము" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు చిన్నాల గోనాథ్, దుబాసి వెంకటస్వామి, పసుల రమేష్, పర్నెం మల్లారెడ్డి, అల్లం రఘు నారాయణ, పాడి ప్రతాప్ రెడ్డి, నిట్టే బాలరాజు, చందుపట్ల రాఘవరెడ్డి, మడికొండ సంపత్, మడికొండ శ్రీను, మంద నాగరాజు, మార్క రఘుపతి, ఉడుత సంపత్, నల్లెల్ల అనిల్, లక్కం వసంత, పసుల విజయ, దాట్ల కోమల, బొచ్చు జెమిని, గోవింద సురేష్, బొచ్చు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ రహిత సమాజం కోసం నడుం బిగిద్దాం


- డ్రగ్స్ వద్దు-- ఆరోగ్యమే ముద్దు..
- డ్రగ్స్ అంతం.. బద్వేల్ అర్బన్ సీఐ లింగప్ప

జయభేరి, బద్వేలు:

మత్తు పదార్థాలు డ్రగ్స్ గంజాయి రహిత సమాజం కోసం అందరం కలిసికట్టుగా నడుం బిగిద్దామని బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప తెలిపారు శనివారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ముద్రించిన పోస్టర్స్ ను శనివారం బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ నందు అర్బన్ సీఐ లింగప్ప చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో తెలిసి తెలియని వయసులో యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని అన్నారు యువతకు అవేర్నెస్ కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘం నాయకత్వానికి అభినందనలు తెలిపారు ముఖ్యంగా డ్రగ్స్ గంజాయి వంటి వాటికి బానిసవుతున్నారని తద్వారా తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు అన్నారు డ్రగ్స్ గంజాయి వాడిన అమ్మిన నేరమని దానికి కఠిన శిక్షలు ఉన్నాయని వారన్నారు కావున యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా మంచి మార్గంలో నడిచి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు డ్రగ్స్ గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దామని వారు పిలుపునిచ్చారు.

డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ.. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు కాదు యువతకు చైతన్యపరిచే కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతుందని అన్నారు డ్రగ్స్ గంజాయి వద్దు ఆరోగ్యమే ముద్దు అన్నారు అందరికీ విద్య అందరికీ ఉపాధి లక్ష్యంగా డివైఎఫ్ఐ యువజన సంఘం ముందుకు సాగడం జరుగుతుందని యువత అందరం కలిసి డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడదామని అన్నారు దీనిపై భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా సదస్సులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్కే ఆదిల్, ఉపాధ్యక్షులు ఎస్కే ఖలీల్ భాషా డివైఎఫ్ఐ మహిళా కో కన్వీనర్ ఎస్కే ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో విమానాల ప్రభావం



జయభేరి, హైదరాబాద్, నవంబర్ 8:

రెండు రోజుల నుంచి భారత్‌లోని పలు విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ఢిల్లీలోని ఏటీసీ ఆటోమేటిక్ వ్యవస్థ పని చేయలేదు. దీంతో వందల విమానాలు రద్దు చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి ముంబైలో అదే పరిస్థితి ఏర్పడింది. ఇంకా అక్కడ పరిస్థితులు ఇప్పుడిప్పుడే కొలిక్కి వస్తున్నాయి. ఇప్పుడు తాజాగా హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఇలా వరుసగా విమానాశ్రాయాల్లో జరుగుతున్న పరిణామాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. దేశంలోని వివిధ విమానాశ్రయాల్లోని ఏటీసీ అటోమేటిక్ వ్యవస్థ పని చేయలేదు. 36 గంటలు దాటిన తర్వాత ఢిల్లీ, ముంబై, శివమొగ్గ ఎయిర్‌పోర్టుల్లో పరిస్థితులు కంట్రోల్‌లోకి వస్తున్నాయి. అందుకే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రాంతాలకు వెళ్లే విమానాలను రద్దు చేశారు. ఈ విషయాన్ని ప్రయాణికులకు చెప్పకుండా రద్దు చేయడం గందరగోళానికి కారణమైంది. తమకు ముందస్తు సమాచారం లేకుండా ఇలా చేయడం ఏంటని ప్రయాణికులు ఆందోళనబాట పట్టారు. దీంతో ఎయిర్‌పోర్ట్ లో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కౌలాలంపూర్, వియత్నాం, గోవా వెళ్లే విమానాలను అర్ధాంతరంగా రద్దు చేశారు. సాంకేతిక కారణాలతో ఈ చర్యలు తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఢిల్లీ, ముంబై, శివమొగ్గ వెళ్లే విమానాలను కూడా రద్దు చేశారు. దీనికి మాత్రం అక్కడ ఏటీసీ వ్యవస్థ సరిగా పని చేయకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. అర్ధరాత్రి వేళలో ఇలా నిర్ణయం తీసుకోవడంతో ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఎందుకు ఇలాంటి పని చేశారని సిబ్బందిని ప్రశ్నిస్తే రూడ్‌గా సమాధానం చెప్పారని మండిపడ్డారు. గంటల తరబడి ఎదురు చూస్తున్నా వారి నుంచి సరైన స్పందన రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో సాధారణ పరిస్థితి**

మరోవైపు ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ATC) సాంకేతిక సమస్య పరిష్కారమైందనివిమాన కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని ఢిల్లీ విమానాశ్రయ అథారిటీ ప్రకటించింది. పరిస్థితి ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకుంటుందని అందులో పేర్కొంది. ఢిల్లీ విమానాశ్రయ అథారిటీ ఇచ్చిన ప్రకటనలో ఇలా ఉంది , "ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విమాన ప్రణాళిక ప్రక్రియకు సహాయపడే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ (AMSS)ను ప్రభావితం చేసే సాంకేతిక సమస్య క్రమంగా మెరుగుపడుతోంది. ఢిల్లీ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. సంబంధిత అధికారులందరూ అసౌకర్యాన్ని తగ్గించడానికి పనిచేస్తున్నారు. తాజా విమాన సంబంధిత సమాచారం కోసం ప్రయాణీకులు తమ విమానయాన సంస్థతో సన్నిహితంగా ఉండాలని సూచించారు."

**800 కంటే ఎక్కువ విమానాలు ప్రభావితమయ్యాయి**

గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఢిల్లీ విమానాశ్రయంలో 800 కంటే ఎక్కువ విమానాలు ప్రభావితమయ్యాయి. సాంకేతిక సమస్య కారణంగా AMSS మూసివేశారు. AMSS అంటే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్. ఇది విమాన కార్యకలాపాలలో కీలక పాత్ర పోషిస్తుంది, కానీ సాంకేతిక సమస్య కారణంగా ఇది ఆటోమేటిక్‌గా మూసివేశారు. ఈ సమస్య వేల మంది ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగించింది.

# జార్జిరెడ్డి పిడిఎస్ యూ మొదటి వార్షికోత్సవం

- నల్గొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ్డుపల్లి కళాచారి, కుందరపు రాకేష్
- ఇండియన్ లెజెండరీ లీడర్ జార్జిరెడ్డి స్ఫూర్తితో సమానత్వ సమాజ స్థాపన కోసం పోరాడాలని జార్జిరెడ్డి పిడిఎస్ యు పిలుపు

జయభేరి, నల్గొండ జిల్లా :




జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ (ఆవిర్భావ దినోత్సవం) మొదటి వార్షికోత్సవం సందర్భంగా జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా ప్రధాన కేంద్రం శ్రీనగర్ కాలనీ బాలుర వసతి గృహం నందు జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి అధ్యక్ష కార్యదర్శులు బొడ్డుపల్లి కళాచారి కుందారపు రాకేష్ పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అరుణతార జార్జిరెడ్డి ఆశయాల సాధనకు జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ నిజాయితీగా పోరాడుతుందని అభినందించారు. దేశంలో పెరిగిపోతున్న అసమానతలకు వ్యతిరేకంగా, సమానత్వ సమాజ స్థాపనకు జార్జిరెడ్డి స్ఫూర్తితో యువత ఉద్యమ బాట పట్టాలని అన్నారు. తెలంగాణలో 42 శాతం బి.సి. రిజర్వేషన్లు అంశం ప్రజాస్వామికమైనదని ఈ ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ సంతాప తీర్మానం ప్రకటించారు. జార్జి రెడ్డి పి.డి.ఎస్.యూ ప్రభుత్వ విద్యా రంగ బలోపేతం కోసం అవిరామంగా పోరాడుతున్నదనీ అన్నారు. సమానత్వ సమాజ స్థాపన లక్ష్యంతో, ఇండియన్ లెజెండరీ లీడర్ జార్జిరెడ్డి ఆశయాల సాధనకై జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ పోరాట మార్గంలో ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా కమిటీ సభ్యులు అంతటి రమేష్‌సాయి సింగం అనిల్ శ్రీకాంత్ మహేష్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ హయాంలో సమస్యలు తీరక.. ఇప్పుడూ తీరకపోతే ఎలా?

- ప్రశ్నించిన జాగృతి అధ్యక్షురాలు కవిత

జయభేరి, హైదరాబాద్ నవంబర్ 8:

వరంగల్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ఆగిపోయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిపై రోగుల ఒత్తిడి పెరిగిందని అన్నారు. వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిని కవిత సందర్శించారు. వరద బాదితులను పరామర్శించారు. తదుపరి హనుమకొండ లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు, మంత్రులున్నా ఫలితం లేదని విమర్శించారు. ఆస్పత్రిని బిఆర్ఎస్ లేదా కాంగ్రెస్ ఎవరు నిర్లక్ష్యం చేసినా తప్పేనని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో సమస్యలు తీరక.. ఇప్పుడూ తీరకపోతే ఎలా? అని కవిత ప్రశ్నించారు. తెచ్చుకున్న తెలంగాణలో సమస్యలు పరిష్కారం కావడం లేదని, రాజకీయాలు ఎన్నికలు జరిగే చివరి ఏడాదిలో చేసుకుందాం అని తెలియజేశారు. తన పర్యటనల ద్వారా ప్రజలకు పైసా మేలు జరిగినా తన జన్మ ధన్యమైనట్లేనని కవిత పేర్కొన్నారు.

# మళ్లీ బిఆర్ఎస్ వైపు గూడెం బ్రదర్స్..?

జయభేరి, సంగారెడ్డి:

శుక్రవారం జరిగిన బిఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి ప్రత్యక్షమయ్యారు. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి 2014, 2018, 2023 ఎన్నికల్లో వరుసగా గెలిచిచారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయ పరిణామాలు మారాయి. దాంతో అయన అధికార కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. అయితే మహిపాల్ రెడ్డి ఇప్పటి వరకూ కాంగ్రెస్, బిఆర్ఎస్ సమదూరం పాటించారు. తెరపైకి ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు వచ్చింది. ఇటీవల కొల్లూరులో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ పర్యటన జరిగినప్పుడు అయనకు ఆహ్వానం అందలేదు. సరైన సమాచారం ఇవ్వలేదు అంటూ కాంగ్రెస్ మంత్రుల తీరుపై గూడెం మహిపాల్ రెడ్డి అసంతృప్తిగా వున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ లో ఇండ్ల వద్ద బిఆర్ఎస్ ఆత్మీయ సమావేశం నిర్వహించింది. సమావేశానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి హజరయ్యారు. మహిపాల్ రెడ్డీ సైతం టిఆర్ఎస్ లోకి వస్తారంట అని ప్రచారం నడుస్తోంది.

# క్రికెటర్స్ కు భారీగా బహుమతులు




జయభేరి, ముంబై, నవంబర్ 8:

భారత క్రికెట్ జట్టు మహిళల ప్రపంచ కప్ 2025 గెలిచి చరిత్ర సృష్టించింది. టీమ్ ఇండియా ప్రపంచ ఛాంపియన్ కావడంతో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) దాదాపు 40 కోట్ల రూపాయల ప్రైజ్ మనీ అందించింది. అలాగే, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (BCCI) కూడా భారత జట్టు ఆటగాళ్లకు, సిబ్బంది సభ్యులకు 51 కోట్ల రూపాయల బహుమతిని ప్రకటించిందిభారత్ ప్రపంచ కప్ గెలిచిన తర్వాత, పలు రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులను సత్కరిస్తున్నాయి, వారు భారత ప్రపంచ కప్ జట్టులో సభ్యులుగా ఉన్నారు.

టీమ్ ఇండియా క్రీడాకారిణులకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు కోట్లాది రూపాయల ప్రైజ్ మనీని అందజేస్తున్నారు. శ్రీ చరణి, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రేణుకా ఠాకూర్, రాధా యాదవ్ సహా పలువురు క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల నజరానాను అందించాయి.

**శ్రీ చరణికి ప్రభుత్వ ఉద్యోగం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీమ్ ఇండియా స్టార్ ప్లేయర్, లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణిని కలిశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీ చరణికి ప్రపంచ ఛాంపియన్ అయినందుకు 2.5 కోట్ల రూపాయలు అందజేసింది. దీనితో పాటు 1000 చదరపు గజాల స్థలాన్ని కూడా బహుమతిగా ఇచ్చింది. చంద్రబాబు నాయుడు శ్రీ చరణికి రాష్ట్రంలో గ్రూప్ 1 అధికారిగా ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు.

**మహారాష్ట్ర ప్రభుత్వం 2.25 కోట్ల రూపాయలు అందించింది**

మహారాష్ట్ర ప్రభుత్వం భారత జట్టుకు చెందిన ముగ్గురు క్రీడాకారిణులు, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, స్టార్ బ్యాట్స్ ఉమెన్ జెమీమా రోడ్రిగ్స్, లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్ రాధా యాదవ్‌కు 2.25 కోట్ల రూపాయలను బహుమతిగా అందించింది. టీమ్ ఇండియా కోచ్ అమోల్ మజుందార్ కూడా మహారాష్ట్రకు చెందిన వారే. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం అమోల్ మజుందార్‌కు 22.50 లక్షల రూపాయల చెక్ అందజేసింది.

శ్రీ చరణి నుంచి స్మృతి మంధాన వరకు ప్రభుత్వాలు ఇచ్చిన ప్రైజ్‌మనీ ఇదే! ఏ రాష్ట్రం ఎన్ని కోట్లు ఇచ్చింది?

**క్రాంతి గౌడ్‌కు కూడా సత్కారం**

భారత మహిళా క్రికెట్ జట్టుకు చెందిన మీడియం పేసర్ క్రాంతి గౌడ్‌ను మధ్యప్రదేశ్ ప్రభుత్వం సత్కరించింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ క్రాంతి గౌడ్‌కు 1 కోటి రూపాయల నజరానాను ప్రకటించారు. సీఎం మోహన్ యాదవ్ క్రాంతి గౌడ్ తల్లిదండ్రులను కూడా సత్కరించారు.

శ్రీ చరణి నుంచి స్మృతి మంధాన వరకు ప్రభుత్వాలు ఇచ్చిన ప్రైజ్‌మనీ ఇదే! ఏ రాష్ట్రం ఎన్ని కోట్లు ఇచ్చింది?

**రేణుకా ఠాకూర్‌కు హిమాచల్ ప్రభుత్వం బహుమతి**

హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వింద‌ర్ సింగ్ సుఖు టీమ్ ఇండియాకు చెందిన స్టార్ బౌలర్ రేణుకా ఠాకూర్‌కు మహిళల ప్రపంచ కప్‌లో అద్భుతమైన బౌలింగ్ చేసినందుకు, అలాగే భారత్ ప్రపంచ ఛాంపియన్ కావడంలో భాగమైనందుకు 1 కోటి రూపాయలు అందజేస్తామని ప్రకటించారు. దీనితోపాటు హిమాచల్ ప్రభుత్వం రేణుకాకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. హిమాచల్ ప్రదేశ్‌కు వచ్చిన తర్వాత రేణుకా ఠాకూర్‌ను ఘనంగా సత్కరిస్తామని సీఎం సుఖ్వింద‌ర్ సింగ్ సుఖు అన్నారు. టీమ్ ఇండియా ప్రపంచ కప్ 2025 గెలిచిన తర్వాత హిమాచల్ సీఎం రేణుకాతో ఫోన్‌లో మాట్లాడి విజయంపై అభినందనలు తెలిపారు.

# ఇన్నోవా పల్టీ

**పలువురికి గాయాలు**

జయభేరి, నల్గొండ:

నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, గుండ్రాంపల్లి వద్ద జాతీయ రహదారి 65 హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో వెళ్తున్న ఇన్నోవా వాహనం.. అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ప్రమాద ధాటికి.. ఇన్నోవా వెహికిల్ రోడ్డుపైనే పల్టీలు కొట్టింది. దీంతో, కార్ ఇంజన్ లో మంటలు చెలరేగి, వాహనం నడిరోడ్డుపైనే దగ్ధమయింది. అయినప్పటికీ.. ఇన్నోవా నుంచి ఎనిమిది మంది సురక్షితంగా 8 మంది ప్రయాణికులు ప్రాణాలతో బైట పడ్డారు. వాహనం రోడ్డుకు అడ్డం పడడంతో హైద్రాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవే పై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఓ లారీ అదే సమయంలో రాగా.. అందులో ప్రయాణిస్తున్న వారు.. ప్రాణాలకు తెగించి.. ఇన్నోవా వెహికిల్ లోని ప్రయాణికులకు కాపాడారు. ఈ క్రమంలో వారికి కాలిన గాయాలు అయ్యాయి. మొదటగా చౌటుప్పల్ ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.




## వెండితెరపైకి మైఖేల్ జాక్సన్ జీవితం

తన ఆటపాటలతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన పాప్ రారాజు మైఖేల్ జాక్సన్. పాప్ రంగంలో పేరొందిన స్టార్లు ఎందరైనా ఉండొచ్చుగాక.. వారందరికీ రోల్ మోడల్ మాత్రం మైఖేల్ జాక్సనే. అందుకే అందరూ ఆయన్ను 'కింగ్ ఆఫ్ పాప్' అంటారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందికి ప్రేరణగా నిలిచిన మహాకళాకారుడాయన. సాధారణ స్థాయి నుంచి సూపర్‌స్టార్‌గా మైఖేల్ ఎదిగిన వైనం ఓ అద్భుతమైతే.. ఆయన మరణం ఓ మిస్టరీ. ఈ కోణాలన్నింటినీ స్పృశిస్తూ.. త్వరలో ఆయన జీవితం హాలీవుడ్ తెరపైకి రానున్నది. సినిమా పేరు 'మైఖేల్'. జాఫర్ అనే హాలీవుడ్ నటుడు మైఖేల్ జాక్సన్ రోల్ పోషిస్తున్నారు. ఆంటోయిన్ పుక్వా దర్శకత్వంలో యూనివర్సల్ స్టూడియో నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా విడుదల చేసిన సినిమా తాలూకు లేటెస్ట్ ట్రైలర్ ప్రస్తుతం గ్లోబల్ టాపిక్‌గా మారింది. అచ్చు మైఖేల్‌ని తలపించేలా తెరపై కనిపిస్తున్న జాఫర్‌ని చూసి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మైఖేల్ జాక్సన్ అభిమానులు ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా డబ్బింగ్ వెర్షన్‌లపై ప్రస్తుతానికి ఎలాంటి సమాచారం లేదు.

## కథనార్‌లో నెగెటివ్ రోల్



అగ్ర కథానాయిక అనుష్కశెట్టి నటిస్తున్న తొలి మలయాళ చిత్రం 'కథనార్'. పీరియాడిక్ హారర్ థ్రిల్లర్ కథాంశమిది. జయసూర్య టైటిల్ రోల్‌ని పోషిస్తున్న ఈ చిత్రానికి రోజిన్ థామస్ దర్శకుడు. తొమ్మిదవ శతాబ్దం తాలూకు నేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇటీవల అనుష్కశెట్టి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో ఆమె 'నీలా' అనే ఆత్మ పాత్రలో కనిపిస్తుందని, నెగెటివ్ ఛాయలతో ఈ పాత్ర సాగుతుందని చెబుతున్నారు. ఈ సినిమాలో నటించడం పట్ల పలు ఇంటర్వ్యూల్లో అనుష్కశెట్టి ఆనందం వ్యక్తం చేసింది. సుదీర్ఘ కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని విభిన్న పాత్రను పోషిస్తున్నానని, ఇది మలయాళంలో తన కెరీర్‌కు శుభారంభాన్నిస్తుందని చెప్పింది. అతీత శక్తులు కలిగిన నీలా అనే మహిళగా ఆమె పాత్ర భిన్న కోణాల్లో సాగుతుందని చెబుతున్నారు. 'కథనార్'లోని ఆమె ఫస్ట్‌లుక్ సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకుంటున్నది. ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. అనుష్క తాజా తెలుగు చిత్రం 'ఘాటీ' ప్రేక్షకుల్ని అంతగా ఆకట్టుకోలేకపోయింది.



## సీక్వెల్‌లో హీరోయిన్ ఈమేనా..!

7/జి బృందావన్ కాలనీ సినిమాకు సీక్వెల్ తెరకెక్కిస్తున్నారు. అప్పుడెప్పుడో ఈ సినిమాకు సీక్వెల్ ను అనౌన్స్ చేశారు దర్శకుడు సెల్వ రాఘవన్. అలాగే అదే సమయంలో ఈ మూవీపోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. కాగా ఈ సినిమాలో హీరో హీరోయిన్స్ ఎవరు నటిస్తున్నారని ప్రేక్షకులందరూ ఈగర్ గా ఎదురు చూస్తున్నారు. కాగా 7/జి బృందావన్ కాలనీ సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. ఈ సినిమాలో పాటలన్నీ అభిమానుల్లో సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. మొదటి భాగం విడుదలై పదేళ్ల దాటిన తర్వాత ఇప్పుడు రెండో భాగం ప్రకటించడం అభిమానుల్లో ఉత్కంఠ రేపుతోంది. మొన్నామధ్య విడుదలలైన 7/జి బృందావన్ కాలనీ 2 పోస్టర్‌పై దర్శకుడు, సంగీత దర్శకుడు, కెమెరామెన్ పేర్లను మాత్రమే రాశారు. ఈ పోస్టర్‌లో సినిమాలో నటీనటుల గురించి ఎలాంటి సమాచారం లేకపోవడం గమనార్హం. అయితే ఈ సినిమాలో మొదటి భాగంలో నటించిన రవికృష్ణ మరోసారి హీరోగా నటిస్తున్నాడని టాక్ వినిపిస్తుంది. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ గా మలయాళ నటి చేస్తుందని జోరుగా ప్రచారం జరుగుతుంది. మలయాళంలో ప్రముఖ నటి అనశ్వర రాజన్ ఈ మూవీలో హీరోయిన్ గా నటిస్తారని ఫిలిం సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ అమ్మడు మలయాళంలో పలు సినిమాల్లో నటించింది. అలాగే సోషల్ మీడియాలో ఈ అమ్మడు రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.

## బాలయ్యకు లవర్‌గా.. తల్లిగా..

బాలకృష్ణ కెరీర్ లో ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. అలాగే ఎంతో మంది హీరోయిన్స్ తో కలిసి నటించారు బాలకృష్ణ. అయితే బాలకృష్ణకు తల్లిగా, భార్యగా నటించిన హీరోయిన్స్ కూడా కొంతమంది ముద్దుగుమ్మలు ఉన్నారు. వారిలో ఈ ఈ అందాల భామ ఒకరు. ఆమె ఒకే ఒక్క సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కుర్రాళ్ళ గుండెల్లో బాణాలు గుచ్చింది. ఆమె అందానికి అంతా ఫిదా అయ్యారు. కానీ ఆమె ఒకే ఒక్క సినిమాతో టాలీవుడ్ నుంచి మాయం అయ్యింది. ఇంతకూ ఎవరో కనిపెట్టరా.? ఆమె పేరు చెప్తే కుర్రాళ్ళు కిర్రెక్కిపోతారు. హనీ రోజ్.. ఒకే ఒక్క సినిమాతో విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. హనీరోజ్.. తెలుగులో ఈ అమ్మడు ఒకే ఒక్క సినిమాతో కుర్రాళ్ళ హాట్ ఫేవరెట్ అయ్యిపోయింది. మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తెలుగులో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. నట సింహం నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన వీర సింహారెడ్డి సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. వీరసింహారెడ్డి సినిమాలో రెండు డిఫరెట్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించి ఆకట్టుకుంది ఈ చిన్నది. బాలకృష్ణ తల్లిగా, భార్యగా నటించి మెప్పించింది. అలాగే ఈ అమ్మడు అందంతోనే కాదు నటన పరంగాను మంచి మార్కులు తెచ్చుకుంది. అయితే ఈ సినిమా తర్వాత హనీ రోజ్ సినిమాలు చేయలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది.



## విజయ్ 'జననాయగన్' ఫస్ట్ సింగిల్ 'తలపతి కచేరీ' విడుదల



కోట్లాది మంది అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తలపతి విజయ్ 'జననాయగన్' సినిమా నుండి మొదటి పాట విడుదలైంది. 'తలపతి కచేరీ' అంటూ సాగే ఈ మాస్ సాంగ్‌ని శనివారం సాయంత్రం విడుదల చేయగా.. విడుదలైన కొద్దిసేపట్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యువ సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ ఈ పాటను తనదైన స్టైల్‌లో అదిరిపోయే బీట్స్‌తో స్వరపరిచారు. ఈ పాటలో విజయ్ తన గొంతు వినిపించగా, అనిరుధ్, అరివు కూడా కలిసి పాడారు. అనిరుధ్ ఎనర్జిటిక్ మ్యూజిక్ మరియు విజయ్ గ్రేస్ కలయికతో ఈ పాట థియేటర్లలో ప్రేక్షకులను ఉర్రూతలూగించడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.
ఈ పాట వీడియోలో తలపతి విజయ్ గత బ్లాక్‌బస్టర్ సినిమాలైన 'ఘిల్లీ', 'తుపాకీ', 'మెర్సల్', 'మాస్టర్' వంటి చిత్రాలలోని తన ప్రసిద్ధ డ్యాన్స్ స్టెప్స్, సిగ్నేచర్ మూమెంట్స్‌ని గుర్తుచేస్తూ స్టెప్పులేయడం అభిమానులను మరింతగా ఉర్రూతలూగిస్తోంది. మాస్ చిత్రాల దర్శకుడు హెచ్. వినోద్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుంది. మమితా బైజు ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా విజయ్ కెరీర్‌లో 69వ సినిమా మాత్రమే కాక, నటనకు ఆయన చివరి చిత్రం కావచ్చనే వార్తలు రావడంతో దీనిపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**